గుకేశ్‌కు 5 కోట్ల నజరానా

- తమిళ నాడు సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై: ప్రతిష్ఠాత్మక చెస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో టైటిల్ విజేతగా నిలిచిన యువ ప్లేయర్ దొమ్మరాజు గుకేశ్ ప్రదర్శనకు తగిన గుర్తింపు లభిస్తున్నది. టోర్నీ సుదీర్ఘ ప్రస్థానంలో విజేతగా నిలిచిన అతి పిన్న వయసు ప్లేయర్‌గా నిలిచిన గుకేశ్ సొంత రాష్ట్రం తమిళనాడు భారీ నజరానా ప్రకటించింది. ప్రపంచ చెస్ విజేతగా నిలిచిన గుకేశ్‌కు 5 కోట్లు నగదు ప్రోత్సాహకం ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని సీఎం స్టాలిన్ అధికారిక ఎక్స్‌లో పేర్కొన్నారు. దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసేలా రాణించిన గుకేశ్ భవిష్యత్‌లోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

గుకేశ్.. ఆంధ్రా, తమిళా?

చెస్ ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ దక్కించుకున్న గుకేశ్ తమవాడంటే తమ వాడని అటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు వాదించుకుంటున్నాయి. ఏపీలోని చిత్తూరు జిల్లా మూలలున్నా..గుకేశ్ పుట్టి, పెరిగింది చెన్నైలో. గుకేశ్ తల్లిదండ్రులు ఇద్దరు కూడా వైద్యులు. అయితే గుకేశ్ చిరస్మరణీయ విజయం నేపథ్యంలో ఏపీ, తమిళనాడుకు చెందిన ఇద్దరు సీఎంలు తామవాడేనంటూ ఎక్స్‌లో పోటీపడి సందేశాలు రాసుకురావడం చర్చనీయాంశంగా మారింది.

తిలక్ కెప్టెన్సీలో..

విజయ్ హజారే టోర్నీకి హైదరాబాద్ జట్టు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అహ్మదాబాద్ వేదికగా ఈనెల 21 నుంచి మొదలయ్యే విజయ్ హజారే టోర్నీ కోసం హెచ్‌సీఏ సీనియర్ సెలెక్షన్ కమిటీ శుక్రవారం హైదరాబాద్ జట్టును ప్రకటించింది. 15 మందితో కూడిన జట్టుకు స్టార్ బ్యాటర్ తిలక్‌వర్మ, సీనియర్ పేసర్ సీవీ మిలింద్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.

జట్టు వివరాలు: తిలక్‌వర్మ(కెప్టెన్), మిలింద్ (వైస్ కెప్టెన్), తన్మయ్, రోహిత్‌రాయుడు, నితీశ్, వరుణ్, అభిరాత్, నితేశ్, రాహుల్ రాదేశ్, అలీ కచి, నిశాంత్, అజయ్‌దేవ్, తనయ్, అనికేత్‌రెడ్డి, ముదాస్సిర్.

అన్వయ్ ద్రవిడ్ అదుర్స్

జార్ఖండ్‌పై అజేయ సెంచరీ • విజయ్ మర్చంట్ టోర్నీ

మూలపాడు(ఆంధ్రప్రదేశ్): భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ తనయుడు అన్వయ్ అదరగొడుతున్నాడు. తండ్రికి తగ్గ తనయుడని నిరూపిస్తూ విజయ్ మర్చంట్ ట్రోఫీలో జార్ఖండ్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో కర్నాటక తరపున బరిలోకి దిగిన అన్వయ్(153 బంతుల్లో 100 నాటౌట్, 10ఫోర్లు, 2సిక్స్‌లు) అజేయ సెంచరీతో కదం తొక్కాడు. అన్వయ్ విజృంభణతో కర్నాటక 123.3 ఓవర్లలో 441/4 స్కోరు చేసింది. ఈ క్రమంలో మూడో వికెట్‌కు అనిరుధ్(76)తో కలిసి అన్వయ్ 167 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు భారీ స్కోరుకు కారణమయ్యాడు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన జార్ఖండ్ 128.4 ఓవర్లలో 387 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కర్నాటక మూడు పాయింట్లు ఖాతాలో వేసుకుంది. గతేడాది కూడా కర్నాటక అండర్-14 టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన అన్వయ్ అజేయ డబుల్ సెంచరీతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.

నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టు

గబ్బా ఫైట్

ఆధిక్యం కోసం ఇరు జట్ల ఆరాటం

ఓపెనింగ్‌లో రోహిత్, రానాకు బదులుగా ఆకాశ్

బోలాండ్ స్థానంలో జట్టులోకి హాజిల్‌వుడ్

ఉ: 5.50 స్టార్ స్పోర్ట్స్‌లో

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ)లో మరో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి 1-1తో సమంగా నిలిచిన నేపథ్యంలో మూడో టెస్టు కీలకం కాబోతున్నది. సిరీస్ విజేతను నిర్ణయించే గబ్బా టెస్టుపై అందరికీ ఆసక్తి నెలకొన్నది. పెర్త్‌లో భారత్ విజయ శంఖారావం పూరిస్తే..పుంజుకున్న ఆసీస్ అడిలైడ్‌లో గులాబీ ముల్లు గుచ్చింది. పేస్‌కు స్వర్గధామమైన గబ్బాలో భారత్, ఆసీస్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. పచ్చికతో కళ కళ లాడుతున్న పిచ్‌పై పేసర్లు వికెట్ల పండుగ చేసుకోనున్నారు. కెప్టెన్ రోహిత్ ఓపెనింగ్‌కు వస్తాడా లేక ఆరుకు పరిమితమవుతాడా అన్నది తేలనుంది. రానా స్థానంలో ఆకాశ్‌దీప్ రాక ఖరారు కాగా, బోలాండ్ బదులుగా హాజిల్‌వుడ్ ఆసీస్ జట్టులోకి వచ్చేశాడు.

బ్రిస్బేన్: బీజీటీ సిరీస్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆసక్తికర సమరానికి మరికొన్ని గంటల్లో తెరలేవనుంది. భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 5.50 నిమిషాలకు మొదలయ్యే మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పెర్త్ టెస్టు విజయంతో సిరీస్‌ను ఘనంగా ప్రారంభించిన టీమ్‌ఇండియాకు అడిలైడ్‌లో ఆసీస్..గులాబీ ముల్లుతో కిందికి దించింది. మరీ పేస్‌కు చిరునామా అయిన గబ్బాలో ఎవరిపై ఎవరి ఆధిపత్యమవుతుందో చూడాలి. పెట్టని కోటలాంటి గబ్బాలో కంగారూలకు మెరుగైన రికార్డు ఉంది. తమ పేస్ దళంతో ప్రత్యర్థి బ్యాటర్లకు చుక్కలు చూపించే ఆసీస్..మరోమారు పక్కా ప్రణాళికతో బరిలోకి దిగుతున్నది. సరిగ్గా మూడేండ్ల క్రితం ఇదే గబ్బాలో టీమ్‌ఇండియా చారిత్రక విజయం సాధించింది. మళ్లీ అదే ప్రదర్శనను పునరావృతం చేసేందుకు భారత్ తహతహలాడుతున్నది. గబ్బాలో గెలిచిన జట్టు సిరీస్ గెలుస్తుందన్న నమ్మకాన్ని ఏ జట్టు నిజం చేస్తుందో చూడాలి.

ఓపెనర్‌గా రోహిత్!

జట్టులో కెప్టెన్ రోహిత్‌శర్మ బ్యాటింగ్ ఆర్డర్‌పై సందిగ్ధత కొనసాగుతున్నది. అడిలైడ్ టెస్టులో ఆరో స్థానంలో వచ్చి విఫలమైన రోహిత్..తన రెగ్యులర్ స్థానమైన ఓపెనింగ్‌లో వస్తాడా లేదా అన్నది శనివారం తేలనుంది. అంతకుమించి బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు జరిగే అవకాశం లేదు. సీనియర్లు రోహిత్, కోహ్లీ నిలకడలేమి జట్టును కలవరపెడుతున్నది. పెర్త్ టెస్టులో సెంచరీ చేసిన కోహ్లీ..అడిలైడ్‌లో అంచనాలకు అనుగుణంగా రాణించలేకపోయాడు. హర్షిత్ రానా స్థానంలో ఆకాశ్‌దీప్ రాక దాదాపు ఖరారు కాగా, స్పిన్ ఆల్‌రౌండర్‌గా సుందర్ జట్టులోకి వచ్చే చాన్స్ ఉంది. పేస్ దళానికి బుమ్రా నాయకత్వం వహించనున్నాడు.

హాజిల్‌వుడ్ ఆగయా:

గాయంతో అడిలైడ్ పోరుకు దూరమైన హాజిల్‌వుడ్ గబ్బా టెస్టుకు సిద్ధమయ్యాడు. స్కాట్ బోలాండ్ స్థానంలో హాజిల్‌వుడ్ తుది జట్టులోకి రానున్నాడు. కమిన్స్, హాజిల్‌వుడ్, స్టార్క్ చెలరేగితే భారత్‌కు ఇబ్బందులు తప్పకపోవచ్చు. గబ్బాలో వీరి పేస్ దాడిని తట్టుకోవడం టీమ్‌ఇండియా బ్యాటర్లకు కత్తిమీద సామే కానుంది. లబుషేన్, స్మిత్ ఫామ్ కలవరపెడుతుండగా, హెడ్ జోరు ఆ జట్టుకు వరంగా మారింది.

జట్ల అంచనా

భారత్: రోహిత్(కెప్టెన్), జైస్వాల్, రాహుల్, గిల్, కోహ్లీ, పంత్, రాహుల్/రోహిత్, నితీశ్‌కుమార్, సుందర్/అశ్విన్, ఆకాశ్‌దీప్, సిరాజ్, బుమ్రా

ఆస్ట్రేలియా: ఖవాజ, మెక్‌స్వీని, లబుషేన్, స్మిత్, హెడ్, మార్ష్, క్యారీ, కమిన్స్(కెప్టెన్), స్టార్క్, లియాన్, హాజిల్‌వుడ్

సెమీస్‌లో సహజ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: షోలాపూర్(మహారాష్ట్ర) వేదికగా జరుగుతున్న ఐటీఎఫ్ 35కే టెన్నిస్ టోర్నీలో తెలంగాణ స్టార్ ప్లేయర్ సహజ యమ్లపల్లి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సహజ 6-3, 6-0తో యశిన ఎట్టరీనా(రష్యా)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కొనసాగించిన సహజ..వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించింది.

గాయత్రి జోడీ నిష్క్రమణ

- బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్

హాంగ్జౌ: ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీలో భారత యువ ద్వయం గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ జోడీ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ గ్రూపు-ఏలో గోపీచంద్, త్రిసా ద్వయం 17-21, 13-21తో జపాన్‌కు చెందిన మత్సుయమ, చిహారు జంట చేతిలో ఓడింది. ఇటీవలే సయ్యద్ మోడీ టోర్నీ గెలిచిన జోరు కనిపించిన గాయత్రి, త్రిసా...ప్రపంచ నంబర్‌ఫోర్ జోడీ నుంచి గట్టి పోటీ ఎదురైంది. వీరి నిష్క్రమణతో భారత పోరు ముగిసింది.

ప్రతీక, తనుజకు చోటు

- వెస్టిండీస్‌తో సిరీస్‌లకు టీమ్‌ఇండియా ఎంపిక

ముంబై: స్వదేశం వేదికగా వెస్టిండీస్‌తో జరిగే టీ20, వన్డే సిరీస్‌ల కోసం బీసీసీఐ శుక్రవారం భారత మహిళల క్రికెట్ జట్లను ప్రకటించింది. ఈనెల 15 నుంచి మొదలయ్యే టీ20 సిరీస్‌తో పాటు వన్డే సిరీస్‌కు వేర్వేరు జట్లను ఎంపిక చేసింది. దేశవాళీలో రాణిస్తున్న ప్రతీక రావల్, తనూజ కన్వర్‌కు తొలిసారి వన్డే జట్టులో చోటు దక్కగా, ఆల్‌రౌండర్ రాగ్వి బిస్ట్ టీ20 జట్టుకు మొదటిసారి ఎంపికైంది. స్టార్ ఓపెనర్ షెఫాలీవర్మ రెండు జట్లలో చోటు దక్కకపోగా, గాయాల కారణంగా యస్తికా భాటియా, శ్రేయాంక పాటిల్, ప్రియా పునియా దూరమయ్యారు.

నేడు చాంపియన్స్ ట్రోఫీ భవితవ్యం

ఫైనల్లో ముంబై, మధ్యప్రదేశ్

రాణించిన రహానే, పాటిదార్

సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీ

బెంగళూరు: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ముంబై, మధ్యప్రదేశ్ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో ముంబై 6 వికెట్ల తేడాతో బరోడాపై ఘన విజయం సాధించింది. బరోడా మొదట నిర్ణీత 20 ఓవర్లలో 158/7 స్కోరు చేసింది. శివాలిక్‌శర్మ(36 నాటౌట్), శాశ్వత్ రావత్ (33) రాణించారు. సుయాంశ్(2/11) రెండు వికెట్లు తీశాడు. ఆ తర్వాత ఛేదనకు దిగిన ముంబై 17.2 ఓవర్లలో 164/4 స్కోరుతో లక్ష్యాన్ని అందుకుంది. రహానే(56 బంతుల్లో 98, 11ఫోర్లు, 5సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో విజృంభించాడు. తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ రహానే బౌండరీలతో చెలరేగాడు. హార్దిక్, అతిత్, అభిమన్యు, శాశ్వత్ ఒక్కో వికెట్ తీశారు. మరో సెమీస్‌లో ఢిల్లీపై మధ్యప్రదేశ్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. ఢిల్లీ నిర్దేశించిన 147 పరుగుల లక్ష్యాన్ని ఎంపీ 15.4 ఓవర్లలో 152/3 స్కోరు చేసింది. కెప్టెన్ రజత్ పాటిదార్(66 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో రాణించాడు. ఇషాంత్ శర్మకు రెండు వికెట్లు దక్కాయి. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 146/5 స్కోరు చేసింది. వెంకటేశ్ అయ్యర్(2/12) ఆకట్టుకున్నాడు.

అల్లు అర్జున్‌కు ఇండస్ట్రీ మద్దతు

ట్రెండింగ్‌లో 'ఐ స్టాండ్ విత్ అల్లు అర్జున్' హ్యాష్‌ట్యాగ్ • దేశవ్యాప్తంగా అభిమానుల సంఘీభావం

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అగ్ర నటుడు అల్లు అర్జున్ అరెస్ట్‌పై పలువురు సినీ తారలు విచారం వ్యక్తం చేశారు. ఆ సంఘటనకు ఏ ఒక్క వ్యక్తినో బాధ్యున్ని చేయడం సరికాదని అన్నారు. అల్లు అర్జున్‌కు మద్దతుగా సోషల్‌మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టారు. 'ఐ స్టాండ్ విత్ అల్లు అర్జున్' హ్యాష్‌ట్యాగ్ ఎక్స్‌లో ట్రెండ్ అయింది. అల్లు అర్జున్ అరెస్ట్ ఉదంతం తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయ స్థాయిలో హాట్‌టాపిక్‌గా మారింది. 'పుష్ప-2' పాన్ ఇండియా స్థాయిలో భారీ వసూళ్లతో దూసుకుపోతున్న తరుణంలో అల్లు అర్జున్ అరెస్ట్ కావడం ఆయన అభిమానులను కలవరపరచింది.

అల్లు అర్జున్ అరెస్ట్ అన్యాయం. ఇలా చేయడం కరెక్ట్ కాదు. తెలుగు చిత్రపరిశ్రమ అతనికి అండగా ఉంటుంది. మేం అందరం అతనితో ఉన్నాం.
- నందమూరి బాలకృష్ణ

సంధ్య థియేటర్ వద్ద జరిగింది దురదృష్టమైన హృదయ విదారక సంఘటన. దాని నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. మరిన్ని జాగ్రత్తలు పాటించి, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో మనందరి తప్పు ఉంది. ఒక్కరినే నిందించడం, ఒక్కరినే బాధ్యుడ్ని చేయడం సబబు కాదు. సినిమావాళ్ల విషయంలో ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే చొరవ సాధారణ పౌరులపై కూడా చూపించాలని కోరుకుంటున్నా. **-నాని**

ఈ విషయాన్ని అస్సలు నమ్మలేకపోతున్నా. థియేటర్ వద్ద జరిగిన సంఘటన చాలా దురదృష్టకరం. అయితే దానికి ఒక్క వ్యక్తిని బాధ్యున్ని చేసి ఇబ్బంది పెట్టడం ఏమాత్రం సబబుగా లేదు. ఈ పరిణామాలు హృదయాన్ని కలచివేస్తున్నాయి. **-రష్మిక మందన్న**

సంధ్య థియేటర్ సంఘటన బాధాకరమైనది, హృదయ విదారకమైనది. మెరుగైన భద్రత లేకపోవడం వల్లే ఇలా జరిగిందని ఆ సంఘటన చెబుతున్నది. ఈ దురదృష్ట సంఘటనకు అల్లు అర్జున్‌గారిని బాధ్యుడ్ని చేయడం ఏమాత్రం సమంజసం కాదు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంలో ఆయన బాధ్యతగా వ్యవహరించారు. దీనికి అందరం ఆయన్ని ప్రశంసించాలి. నిందలతో నిజాన్ని కప్పివేయలేం. బాధిత కుటుంబానికి న్యాయం జరగనివ్వండి. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సమాజంలో అందరిదీ. **- అనిల్ రావిపూడి**

1. పుష్కరాలు, బ్రహ్మోత్సవాల టైమ్‌లో తోపులాట జరిగి భక్తులు చనిపోతే దేవుళ్లను అరెస్ట్ చేస్తారా?
2. ఎన్నికల ప్రచారాల్లో జరిగిన తొక్కిసలాటల్లో ఎవరైనా పోతే నాయకుల్ని అరెస్ట్ చేస్తారా?
3. లక్షలాది అభిమానుల సమక్షంలో ప్రీరిలీజ్ ఈవెంట్స్ జరిగినప్పుడు అభిమానుల్లో ఎవరైనా పోతే హీరోహీరోయిన్లని అరెస్ట్ చేస్తారా?
4. భద్రతా ఏర్పాట్లను పోలీసులే చూసుకోవాలి. ఫిల్మ్ హీరోలు, నాయకులు వాటిని ఎలా మేనేజ్ చేయగలరు? జనాన్ని ఎలా కంట్రోల్ చేయగలరు?

- రామ్‌గోపాల్‌వర్మ

ఇలాంటి సందర్భాల్లో భద్రతాపరమైన అంశాలను నటీనటులు ఒక్కరే చూసుకోలేరు. జాగ్రత్తగా ఉండాలని తమ పక్కనున్న వారికి చెబుతుంటారు. ఇలాంటి దురదృష్టకరమైన సంఘటనల విషయంలో ఒక్క వ్యక్తిని లక్ష్యంగా చేసుకోవడం అన్యాయం.
-బాలీవుడ్ నటుడు వరుణ్‌ధావన్

ఏవైనా విషాదకరమైన సంఘటనలు జరిగినప్పుడు భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అంతేకాని ఒక్క వ్యక్తికి తప్పుని ఆపాదించడం భావ్యం కాదు. అందరూ సమిష్టి బాధ్యత తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి. **- నితిన్**

వినోదాలతో 'సంక్రాంతికి వస్తున్నాం'

వెంకటేష్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్‌రావిపూడి దర్శకుడు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచారు. శుక్రవారం వెంకటేష్ పుట్టిన రోజు సందర్భంగా సెకండ్ సింగిల్ ప్రోమోను విడుదల చేశారు. ఇందులో నాయకానాయకులు వెంకటేష్, మీనాక్షి చౌదరి, ఐశ్వర్యరాజేష్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. ఈ సినిమాలో వెంకటేష్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. క్రైమ్ కామెడీ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆద్యంతం వినోదప్రధానంగా ఆకట్టుకునే చిత్రమిదని, సంక్రాంతికి పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుందని చిత్రబృందం పేర్కొంది. రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేష్, మురళీధర్ గౌడ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.

వైవిధ్యమైన కథలో

విలక్షణ నటుడు చియాన్ విక్రమ్ కథానాయకుడిగా ఓ చిత్రం రూపొందనుంది. 'చియాన్ 63' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రానికి మడోన్ అశ్విన్ దర్శకుడు. అరుణ్ విశ్వ నిర్మాత. శుక్రవారం ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటనను మేకర్స్ విడుదల చేశారు. త్వరలో షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ 'దేశంలోని అత్యుత్తమ నటుల్లో విక్రమ్ ఒకరు. మా సంస్థ నుంచి వస్తున్న మూడవ సినిమాలో హీరో ఆయన కావడం ఆనందంగా ఉంది. దర్శకుడు మడోన్ అశ్విన్ అద్భుతమైన స్క్రిప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులందరినీ అలరించే సినిమాగా నిర్మించనున్నాం. ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటుల వివరాలు త్వరలో తెలియజేస్తాం' అని తెలిపారు. శాంతి టాకీస్ పతాకంపై ఈ సినిమా రూపొందనుంది.

కథ వినగానే ఎక్సైట్ అయ్యాను

'ఈ కథ వినగానే చాలా ఎక్సైట్ అయ్యాను. ఎక్కడికి వెళ్లినా ఈ కథే గుర్తొచ్చేది. నరేష్ డేట్స్ కోసం రెండేళ్లు వెయిట్ చేసి ఈ సినిమా తీశా' అన్నారు నిర్మాత రాజేష్ దండా. సామజవరగమన, ఊరు పేరు భైరవకోన వంటి చిత్రాలతో ఆయన అభిరుచిగల నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు. అల్లరి నరేష్ కథానాయకుడిగా సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన 'బచ్చలమల్లి' ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేష్ దండా మాట్లాడుతూ '1980 దశకంలో కథ నడుస్తుంది. బచ్చలమల్లి అనే వ్యక్తిని స్ఫూర్తిగా తీసుకొని తయారుచేసిన ఫిక్షనల్ స్టోరీ ఇది. సరిదిద్దుకోలేని తప్పులు చేస్తే జీవితంలో ఎలాంటి పర్యవసానాలను ఎదుర్కోవాల్సివస్తుందనే అంశాలను చూపించాం' అన్నారు. ఓ ప్రేక్షకుడిలా తాను కథలు వింటానని, ఒకే మూసకు పరిమితం కాకుండా డిఫరెంట్ జోనర్స్‌లో సినిమాలు చేయాలన్నదే తన లక్ష్యమని రాజేష్ దండా తెలిపారు. ఇప్పటివరకు నరేష్‌తో సీరియస్ కాన్సెప్ట్‌తో సినిమాలు చేశానని, భవిష్యత్తులో ఆయనతో ఫుల్‌లెంగ్త్ కామెడీ మూవీ తీసే ఆలోచన ఉందని ఆయన చెప్పారు.

చిత్రం

సూర్యతో జోడీగా..

దక్షిణాది చిత్రసీమలో త్రిష హవా నడుస్తోంది. ప్రస్తుతం ఈ భామ ఏడు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. 'పొన్నియన్ సెల్వన్' సిరీస్ చిత్రాల భారీ సక్సెస్‌తో త్రిష దశ మారిపోయింది. వరుసగా అగ్ర హీరోల చిత్రాలను అంగీకరిస్తూ బిజీబిజీగా మారింది. తాజాగా ఈ భామ అగ్ర హీరో సూర్య 45వ చిత్రంలో కథానాయికగా ఖరారైంది. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. సూర్య నటిస్తున్న 45వ చిత్రం ఇటీవలే ప్రారంభమైంది. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. సూర్య-త్రిష జోడీ విజయవంతమైన చిత్రాల్లో నటించారు. సుదీర్ఘ విరామం తర్వాత వీరు కలిసి నటిస్తుండటం విశేషం. త్రిష ప్రస్తుతం విశ్వంభర, థగ్‌లైఫ్, బ్యాడ్ అండ్ అగ్లీ వంటి భారీ చిత్రాల్లో నటిస్తున్నది.

పోలీస్ పాత్ర నాకు చాలా ప్రత్యేకం

రాణి ముఖర్జీ ప్రధాన పాత్రలో యష్‌రాజ్ ఫిల్మ్స్ పతాకంపై రూపొందిన బ్లాక్‌బస్టర్ 'మర్దానీ'. పదేళ్ల క్రితం విడుదలైన ఈ సినిమాకు 2019లో సీక్వెల్‌గా 'మర్దానీ 2' విడుదలైంది. ఈ రెండూ బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాలను అందుకున్నాయి. 'మర్దానీ 2' విడుదలై శుక్రవారానికి అయిదేండ్లు పూర్తయిన సందర్భంగా 'మర్దానీ 3'కి సంబంధించిన మేకింగ్ వీడియోను యష్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ విడుదల చేసింది. ఇందులో రాణి ముఖర్జీ పోలీస్ ఆఫీసర్ శివానీ శివాజీరాయ్ పాత్రలో కనిపించారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ 'వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి 'మర్దానీ-3' షూటింగ్ మొదలుపెట్టబోతున్నాం. పోలీస్ డ్రెస్ వేసుకొని అద్భుతమైన పాత్ర చేయడం నాకెప్పుడూ ప్రత్యేకమే. ఆ పాత్ర ద్వారా మీనుంచి అమితమైన అభిమానాన్ని పొందాను. సమాజాన్ని కంటికి రెప్పలా కాపాడుతూ, బాధ్యతానిర్వహణలో ప్రాణత్యాగానికి సైతం వెనుకాడని పోలీసులకు ఈ సినిమా అంకితం. గత ఫ్రాంచైజీని మించేలా గూజ్‌బమ్స్ తెప్పించేలా అంచనాలకు మించి ఈ సినిమా ఉండబోతున్నది.' అని తెలిపారు. అభిరాజ్ మినవాలా దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి రచన: ఆయుష్ గుప్తా, నిర్మాత: ఆదిత్య చోప్రా.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.